క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ విగ్రహ వార్షికోత్సవం

కాట్రేనికోన: ఉప్పూడి గ్రామంలో అభయాంజనేయ విగ్రహ దశమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. వేద పండితులు ఆకొండి పవన్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాత దివంగత రంబాల వెంకటసూర్య గోపాలకృష్ణ కుమారుడు చిట్టిబాబు, భవాని దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు 108 కలశాలతో శోభాయాత్ర నిర్వహించి, అభయాంజనేయ స్వామికి అభిషేకం చేశారు. సామూహిక అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ రంబాల రమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం ఓ భక్తుడు విరాళం అందించారు. కాలూరు గ్రామానికి చెందిన కామాడి దుర్గాప్రసాద్ రూ.10,116 విరాళంగా అందజేశారు. అర్చకుడు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో అతనికి ప్రత్యేక దర్శనం అందించారు. శేష వస్త్రం, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి, సత్కరించారు. ఈ సందర్భంగా దాతను సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

కొత్తలంక వలీ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక వలీ బాబా మహా సమాధి అయిన రోజును పురస్కరించుకుని దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు గేదెల రఘునాథబాబా ఆధ్వర్యంలో దర్గా వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై, భోజనాల్లో పాల్గొన్నారు.

రామాలయ ప్రథమ వార్షికోత్సవ ర్యాలీ

కాట్రేనికోన: అయోధ్యలో బాలరాముడి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పల్లం నుంచి ఉప్పూడి వరకు భక్తులు భజన కీర్తనలతో ర్యాలీ నిర్వహించారు. పల్లం గ్రామం నుంచి బాలరాముని ప్రచార వాహనంతో, పాదయాత్రగా దొంతికుర్రు, గెద్దనాపల్లి, కాట్రేనికోన మీదుగా ఉప్పూడికి చేరుకున్నారు. చిన్నారులు సీతారామలక్ష్మణుల వేషధారణతో ఆకట్టుకున్నారు.

మనో వికాస కేంద్రానికి ఇన్వర్టర్ వితరణ



ఇన్వర్టర్, బ్యాటరీ అందజేస్తున్న ప్రభావతి తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలోని హరి మనో వికాస కేంద్రానికి అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ సమకూర్చిన ఇన్వర్టర్‌ను వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. వాకర్స్ ముప్పర్తి రాజారావు, రాజ్యలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సత్యనారాయణమూర్తి, సంజయ్ ఈ ఇన్వర్టర్, బ్యాటరీ సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీకి చెందిన పురోహితులు దివంగత ఖండవిల్లి కృష్ణమూర్తి భార్య సూర్యాకాంతం ఇటీవలే మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి మనవడు సురేష్ ఆర్థిక సహకారంతో కుమారులు పట్టాభిరామాచార్యులు, మనవళ్లు రాంబాబు, చిన్న, రంగ సుమారు 50 మంది నిరుపేదలకు దుప్పట్లు, చీరలు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ధూళిపూడి వెంకటరమణ, ధూళిపూడి సుబ్బారావు, రాయుడు సింహాచలం, వెంటపల్లి నాగభూషణం, ఆనాల పాపారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత్ భారత్ అభియాన్‌పై అవగాహన

అమలాపురం రూరల్: ఉన్నత్ భారత్ అభియాన్ రీజనల్ కో–ఆర్డినేట్ ఇన్‌స్టిట్యూట్(ఏయూ) ఆధ్వర్యంలో కామనగరువులో అమలాపురం డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమంపై యూబీఏ సెల్ అవగాహన సదస్సు నిర్వహించింది. కళాశాల డైరెక్టర్ జీవీఎస్ నాయుడు మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో యువతను భాగస్వాములుగా చేయడం కోసం కేంద్ర మానవ వనరుల శాఖ ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా సమనస గ్రామంతో పాటు, సమీప గ్రామాల అభివృద్ధికి కళాశాల యూబీఏ సెల్ కృషి చేస్తుందన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ యూబీఏ నోడల్ అధికారి ప్రొఫెసర్ జె.అప్పారావు పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజనల్ కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కళాశాల విద్యార్థులు తమ సమీప గ్రామాలలో ఉండే సమస్యలను విశ్లేషించి, పరిష్కారాన్ని సూచించడం ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం రాంబాబు, జి.నాయుడు, ఎం.కిరణ్‌కుమార్, ఎం.సతీష్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కో ఆపరేషన్ లేదిక్కడ..!

- రిఫరల్ క్లినిక్‌గా మారిన సామాజిక ఆస్పత్రి
- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- రోగులకు పూర్తి స్థాయిలో అందని వైద్య సేవలు
- అనస్తీషియన్ లేక జరగని ఆపరేషన్లు
- అధిక కేసులు కాకినాడకు తరలింపు
- ఆస్పత్రి పనితీరుపై రోగుల అసంతృప్తి



తాళ్లరేవు సామాజిక ఆరోగ్య కేంద్రం



గత నెలలో ఆస్పత్రిని సందర్శించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్

తాళ్లరేవు: సామాజిక ఆస్పత్రికి సుస్తీ చేసింది. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఆస్పత్రిలో అనస్తీషియన్(మత్తు మందు వైద్యుడు) లేకపోవడంతో ఆస్పత్రిలో ఆపరేషన్లను చేయడం లేదు. దీంతో చాలావరకు కేసులను కాకినాడ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. దీంతో ఇది రిఫరల్ క్లినిక్‌గా మిగిలిపోయింది. అత్యవసర సమయాల్లో పలు కారణాలతో వైద్యం అందించకుండా, రోగులను కాకినాడకు తరలించడంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీరప్రాంత మండలమైన తాళ్లరేవులో చాలా వరకు కాయకష్టం చేసుకుంటూ జీవనం సాగించేవారే అధికం. ఆయా ప్రాంతాల నుంచి అనేక మంది వైద్యం కోసం మండల కేంద్రంలో ఉన్న తాళ్లరేవు ఆస్పత్రికి వస్తుంటారు. ఆస్పత్రిలో జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, అనస్తీషియన్, ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్యులతో పాటు, పలువురు నర్సులు సైతం అందుబాటులో లేరు. దీంతో వివిధ సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులు సంపూర్ణ వైద్యం అందక నిరాశతో వెనుదిరుగుతున్నారు. పూర్తి స్థాయి వైద్య సేవలందకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

అప్‌గ్రేడ్ చేసినా..

ఎన్నో ఏళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న తాళ్లరేవు ఆస్పత్రిని సుమారు పదేళ్ల క్రితం సామాజిక ఆస్పత్రి (30 పడకల ఆస్పత్రి)గా అప్‌గ్రేడ్ చేశారు. దానికి తగ్గట్టుగా భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించినప్పటికీ, ఆశించిన స్థాయిలో వైద్య సేవలందడం లేదు. తాళ్లరేవు మండలంలో జాతీయ రహదారి ఉండడంతో నిత్యం అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకువస్తే పూర్తి స్థాయిలో వైద్యం అందించకుండా, కేవలం ప్రాథమిక వైద్యం చేసి కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు.

అచూకీ లేని యంత్రం

ఆస్పత్రిలోని ల్యాబ్‌లో సరైన పరికరాలు లేకపోవడంతో, చాలా వరకు టెస్ట్‌లను బయట ల్యాబ్‌లలో చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నట్లు చెబుతున్నారు. ఆస్పత్రి ల్యాబ్‌లో రెండేళ్ల క్రితం రూ.80 వేల విలువైన ఎలక్ట్రోలైట్ అనలైజర్ అనే యంత్రం మాయమైనప్పటికీ, ఇప్పటికీ దాని ఆచూకీ లేదు. దానికి సంబంధించిన టెస్ట్‌లను ఆస్పత్రిలో చేయకుండా, బయటకు రాస్తున్నారు. ఆస్పత్రిలో కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంలో తాళ్లరేవు ఆస్పత్రికి రాష్ట్ర స్థాయిలో మంచి పేరుంది. గత మూడు నెలలుగా అనస్తీషియన్ లేకపోవడంతో ఆపరేషన్లతో పాటు, అత్యవసర కేసులను కాకినాడకు తరలిస్తున్నారు. నెలలో సుమారు పదిలోపు కేసులను ఆస్పత్రిలో చూస్తుండగా, 30కి పైగా కేసులు కాకినాడకు తరలిస్తున్నట్లు సమాచారం.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..!

కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ సగిలి గత నెలలో సీహెచ్‌సీని సందర్శించి, ఆస్పత్రిలో సేవలపై ఆరా తీశారు. సుమారు రూ.నాలుగు కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను నెలాఖరుకల్లా పూర్తి చేసి, అన్ని సేవలను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఆయా పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉండడంతో పాటు, ఆస్పత్రి నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా ఉండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 28వ తేదీన కాకినాడ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పాటు, అనేక సమస్యలను రోగులు వివరించడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్‌తో పాటు, ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి, ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఇప్పటికే వైద్యులు, సిబ్బంది కొరతను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం. అలాగే ఇతర సమస్యలను కూడా వివరించి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా కృషి చేస్తాం.

– రోళ్ల చక్రవర్తి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, తాళ్లరేవు

వైద్యులు, సిబ్బందిని నియమించాలి



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. అనస్తీషియన్ లేకపోవడంతో ఆపరేషన్లు జరగడం లేదు. తక్షణమే అనస్తీషియన్‌ను నియమించాలి. కేసులను కాకినాడకు రిఫర్ చేయకుండా, ఇక్కడే పూర్తి స్థాయి వైద్య సేవలు అందించాలి.

– టేకుమూడి ఈశ్వరరావు, ప్రజా సంఘాల కన్వీనర్

ఐసీయూను ఏర్పాటు చేయాలి



మండలం నుంచి జాతీయ రహదారి 216 వెళుతుండడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అత్యవసర సమయాల్లో రోగులకు వైద్యం అందడం లేదు. జిల్లా కేంద్రమైన కాకినాడకు సుమారు 20 కి.మీ. ప్రయాణించేలోపే క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలో ఉన్న రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థల సహకారంతో ఐసీయూను ఏర్పాటు చేసి, అత్యవసర సేవలను అందించాలి.

– దడాల బుజ్జిబాబు, మాజీ సర్పంచ్, పోలేకుర్రు పంచాయతీ

ఆర్య వైశ్య పెద్దల సామాజిక సేవ అభినందనీయం

ఆర్డీవో మాధవి



నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం టౌన్: సమాజంలో అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ పెద్దలు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆర్డీవో కొత్త మాధవి అన్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో బుధవారం జరిగిన ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతన కార్యవర్గ ప్రతినిధులతో లయన్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఉమ్మడి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. అమలాపురంలో ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ ఐక్యత, సామాజిక సేవా కార్యక్రమాలను వారు అభినందించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శిగా నూలు సూర్యప్రభాకరరావు, కోశాధికారిగా శ్రీఘాకోళపు రాంపండుతో పాటు, నూతన కార్యవర్గ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య మహిళా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు కూడా ప్రమాణం చేసి, బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరించారు. ఆర్య వైశ్య జిల్లా కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, నాయకులు నంబూరి విశ్వనాథం, గ్రంధి గుప్తా, ఎం.నాగేశ్వరరావు, కాళ్లకూరి సత్తిపండు, నంబూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థకు పూర్వ వైభవం తేవాలి

డీఈఓ డాక్టర్ సలీం బాషా



ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంను పరిశీలిస్తున్న డీఈఓ సలీం బాషా

కాట్రేనికోన: ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం కలిగేలా ఉపాధ్యాయులు కృషి చేసి, విద్యా వ్యవస్థకు పూర్వ వైభవం తేవాలని జిల్లా విద్యా శాఖాధికారి డా.షేక్ సలీం బాషా ఆకాంక్షించారు. ప్రస్తుతమున్న ఎన్‌రోల్‌మెంట్ ఆందోళనకరంగా ఉందని, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. చెయ్యేరు శ్రీనివాస అటానమస్ కళాశాలలో 8వ దశ ఎఫ్ఎల్ఎం శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఒకటో తరగతి విద్య పునాదిగా ఉంటుందని చెప్పారు. విద్యార్థుల స్థాయికి వెళ్లి, వారికి అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థికి భాష, గణితంపై అవసరమైన పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలలో బోధన అందిస్తున్న ఉపాధ్యాయులకు సహనం ఉండాలన్నారు. ట్రైనింగ్ సెంటర్ నిర్వహిస్తున్న తీరును ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.రాంబాబు డీఈఓకు వివరించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంను డీఈఓ పరిశీలించారు.

తపో ఆశ్రమాన్ని సందర్శించిన విదేశీ భక్తులు



బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని సందర్శించిన విదేశీ భక్తులు

ముమ్మిడివరం: భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని ఫ్రాన్స్ దేశానికి చెందిన 32 మంది భక్తుల బృందం బుధవారం సందర్శించింది. తొలుత పెద బాలయోగి, చిన బాలయోగీశ్వరుల దివ్య సమాధులను వారు సందర్శించారు. అలాగే బాలయోగీశ్వరులు తపస్సు చేసిన ప్రాంతాన్ని సందర్శించి, వారి సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీరికి తపో ఆశ్రమ కమిటీ సభ్యులు, బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు.

నాసో పరీక్షల్లో నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలు



వైష్ణవికి బంగారు పతకాన్ని అందజేస్తున్న డాక్టర్ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: నేషనల్ ఆస్ట్రోనమి, సైన్స్ ఒలింపియాడ్ (నాసో) ఇటీవల నిర్వహించిన పరీక్షలకు స్థానిక రవీంద్రా స్కూలుకు చెందిన 16 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో నలుగురు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ స్కూలుకు చెందిన విద్యార్థులు మెండు శ్రేష్ట, చెల్లపిళ్ల వైష్ణవి, కొల్లి శ్రావ్య మోక్షిత, చెల్లపిళ్ల ఈశ్వర ఆదిత్య ఈ పరీక్షల్లో ప్రతిభ చూపి, బంగారు పతకాలు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ గిడుగు నాగేశ్వరరావు తెలిపారు. స్కూలులో బుధవారం జరిగిన కోనసీమ సైన్స్ పరిషత్ 2896వ మహా సభకు హాజరైన పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, విశ్రాంత తెలుగు పండితుడు మండలీక ఆదినారాయణ.. ఆ విద్యార్థులను అభినందించి, పతకాలను విజేతలకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూలు అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ సీహెచ్ భార్గవి, హెచ్ఎం ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రుణ బకాయిలు సకాలంలో చెల్లించాలి

లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ

అమలాపురం టౌన్: ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు, టిడ్కో ద్వారా తీసుకున్న రుణాల బకాయిలను సకాలంతో చెల్లించి, సొంత ఆర్థిక ప్రగతితో పాటు, బ్యాంకుల పురోభివృద్ధికి సహకరించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాయంలో బుధవారం జరిగిన టౌన్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ, బ్యాంకుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు, పీఎం స్వనిధి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ, మహిళల మాదిరిగా పురుషులు కూడా గ్రూపులుగా ఏర్పడాలని సూచించారు. తమ కుటీర పరిశ్రమల అభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు అందరూ సకాలంలో చెల్లించాలని పలువురు బ్యాంకు అధికారులు విజ్ఞప్తి చేశారు. మెప్మా జిల్లా జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాస్, టిడ్కో అధికారి డి.లలిత, టౌన్ లెవెల్ ఫెడరేషన్ రిసోర్స్ పర్సన్ పాము శ్యామలతో పాటు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు, ఆర్థికసాయం అందజేత

అల్లవరం: దేవగుప్తం ఇందిరమ్మ కాలనీలో అగ్ని ప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయి, నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు వంటిద్దు వెంకయ్యనాయుడు, అధ్యక్షులు నాగవరపు పరశురాముడు పరామర్శించారు. బాధితులకు రూ.5 వేల నగదు, నిత్యావసరాలను బుధవారం అందించారు. బాధిత కుటుంబంలో ఇద్దరు దివ్యాంగులు ఉండడం దురదృష్టకరమన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. డి.రావులపాలేనికి చెందిన బళ్ల అర్జునరావు బాధిత కుటుంబానికి రూ.10 ఆర్థిక సాయాన్ని అందించారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ ముత్తబత్తుల రాంబాబు, మాజీ సర్పంచ్ పోతుల నాగరాజు, తిక్కా బాబి, వీరబాబు, సాధనాల విఘ్నేశ్వరరావు, బొంతు శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

ట్రంప్ దూకుడు నిర్ణయాలు ఎన్నారైలకు శరాఘాతం

ఏఐవైఎఫ్ జిల్లా సమావేశం ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

అమలాపురం టౌన్: అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ దూకుడు నిర్ణయాలు భారత ఎన్నారైల పాలిట శరాఘాతంలా మారుతున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. అమలాపురంలోని ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బండారు బాలకృష్ణ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ట్రంప్ తీసుకుంటున్న తాజా నిర్ణయాలు వల్ల భారత ఎన్నారైలు ఎదుర్కోనున్న ఇబ్బందులపై చర్చించింది. ముఖ్యఅతిథి సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ, హెచ్‌వన్–బి వీసాపై అమెరికా వైఖరికి నరేంద్ర మోదీ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న ఏఐవైఎఫ్ అమలాపురంలో జరిగే మహాసభల్లో అమెరికా హెచ్ వన్–బి వీసాలు, మోదీ తీరుపై చర్చించాలని సూచించారు. ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల నిర్వహణకు ఆహ్వాన సంఘాన్ని సమావేశం ఏర్పాటు చేసింది. సంఘ అధ్యక్షునిగా నిమ్మకాయల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కాళ్ల భీమరాజు వ్యవహరించనున్నారు. ఏఐవైఎఫ్ ప్రతినిధులు ఉగ్గిరాల సురేష్, వి.ఆనంద్, కె.రామకృష్ణ, మోకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాకర్స్ జిల్లా గవర్నర్‌గా నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం



నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: వాకర్స్–103 జిల్లా గవర్నర్‌గా అమలాపురానికి చెందిన సీనియర్ వాకర్ సప్పా నాగేశ్వరరావు ఇటీవల ఎంపికయ్యారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక శ్రీకళా గ్రాండ్‌లో బుధవారం జరిగింది. వాకర్స్ గవర్నర్‌గా నాగేశ్వరరావుతో వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమె మాట్లాడుతూ, వాకర్స్ ఉద్యమాన్ని జిల్లాలోని పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలని సూచించారు. నాగేశ్వరరావుతో పాటు, జిల్లా వాకర్స్ డిప్యూటీ గవర్నర్లుగా ఉండవల్లి సత్యనారాయణ, బి.ప్రసాద్, చౌడాబత్తుల సోమేశ్వరరావు, క్యాబినెట్ కార్యదర్శిగా పసుమర్తి గోపాలకృష్ణ, కోశాధికారిగా వలవల నాయుడు, జిల్లా బులెటిన్ ఎడిటర్‌గా పుత్సా కృష్ణ కామేశ్వర్, జిల్లా వీఆర్వోగా వై.సత్యనారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ అంతర్జాతీయ ఏరియా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, ఏరియా కో–ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, రీజనల్ కౌన్సిలర్ బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వాకర్స్ చైతన్యం, క్లబ్‌ల విస్తరణ అంశాలపై చర్చించారు. వాకర్స్ జిల్లా మాజీ గవర్నర్ పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతా శంకరమూర్తి, వాకర్స్ ప్రతినిధులు పెనుమాల చిట్టిబాబు, ఉప్పుగంటి భాస్కరరావు, పేరి లక్ష్మీనరసింహం, గోటేటి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. చివరగా నాగేశ్వరరావు దంపతులను జిల్లా ప్రతినిధులు సత్కరించారు.

మాజీ సర్పంచ్ దంపతులకు నివాళి

అమలాపురం రూరల్: మండలంలో చిందాడగరువు మాజీ సర్పంచ్ రాజులపూడి నాగరత్నం, కృష్ణమూర్తి దంపతుల మృతికి పలువురు సంతాపం తెలిపారు. బుధవారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. సర్పంచులు పొనకల గణేష్, రేలంగి దుర్గారావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, కరాటం ప్రసన్న ప్రవీణ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ జవ్వాది బుజ్జి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, మాజీ సర్పంచులు రాజులపూడి భీముడు, మట్టపర్తి నాగరాజు, డాక్టర్ సూరిబాబు, బాలయ్య, రాజులపూడి ఆనంద్ సంతాపం ప్రకటించారు.

27న అసిస్టెంట్ల పరీక్షకు ఏర్పాట్లు

యానాం: పుదుచ్చేరిలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 27న యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి కేంద్రాల్లో పోటీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు బుధవారం డీపీఏఆర్ అండర్ సెక్రటరీ వి.జయశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌తో తీసుకోవాలని కోరారు.

అప్రమత్త డ్రైవింగ్‌తో సురక్షిత ప్రయాణం



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు తదితరులు

అమలాపురం టౌన్: సురక్షిత రోడ్డు ప్రయాణానికి అప్రమత్తమైన డ్రైవింగ్ అవసరమని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అమలాపురం ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాల అవగాహన సదస్సులో డీఎస్పీ మాట్లాడారు. దేశ భవిష్యత్తు యువతతో పాటు, ముఖ్యంగా విద్యార్థుల చేతుల్లో ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఎదుటి వారు పాటించేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ సాగింది. పోలీసు అధికారులతో పాటు, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారెడ్డి, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు ఈశ్వర్, సరోజిని పాల్గొన్నారు.

పశువులను సంరక్షించుకోవాలి



గోపవరంలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బుల్లియ్య

ఉప్పలగుప్తం: పాడి పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటిని సంరక్షించుకోవాలని ఉప్పలగుప్తం ఏరియా పశు వైద్య సహాయ సంచాలకుడు బి.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గోపవరం, చినగాడవిల్లి గ్రామాల్లో సర్పంచులు కుంచే బుల్లియ్య, బద్రి బాబ్జి ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. పశువులకు టీకాలు వేసి, నట్టల నివారణకు, గర్భకోశ వ్యాధులకు వెద్యులు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఎస్.నిరోష, జేవీవో కేవీ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడాలలో..

అల్లవరం: పశువులు, మేకలు, గొర్రెల్లో నట్టల నివారణకు పశు వైద్య శిబిరాల ద్వారా ఉచిత టీకాలు వేస్తున్నామని పశు వైద్యాధికారి ఎం.నారాయణరావు అన్నారు. గూడాలలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులు, గేదెల్లో గర్భకోశ వ్యాధి చికిత్సపై అవగాహన కల్పించారు. పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన డైరీని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్ఓగా సురేష్



యానాం: నియోజకవర్గ ఉత్తమ బూత్ లెవెల్ ఆఫీసర్ అవార్డుకు కమిడి సురేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం పుదుచ్చేరి డిప్యూటీ ఎలక్టోరల్ ఆఫీసర్ బి.తైలావెల్ నుంచి ఉత్తర్వులు అందాయని సురేష్ విలేకరులకు తెలిపారు. ఎలక్టోరల్ ప్రక్రియలో, ఓటు నమోదు తదితర వాటిలో అందించిన ఉత్తమ సేవలకు ఈ అవార్డు లభించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా బీఎల్ఓ సురేష్‌ను పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్: వాసవీ క్లబ్ అమలాపురం శాఖకు ఎంపికైన నూతన కార్యవర్గం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అడ్డగళ్ల గుప్తా, మండవల్లి మురళీకృష్ణ కుమార్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. వాసవీ జిల్లా గవర్నర్ యెండూరి రాఘవకుమారి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అమలాపురం అధ్యక్షునిగా తటవర్తి వీవీఎస్ఎస్ ప్రసాద్, కార్యదర్శిగా తాడికొండ మార్కండేయ గుప్త, కోశాధికారిగా తటవర్తి సురేష్‌తో పాటు, మొత్తం 65 మంది కార్యవర్గ ప్రతినిధులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎస్కే ఓల్డేజ్ హోమ్‌కు క్లబ్ ప్రతినిధి మండవల్లి మురళీకృష్ణకుమార్ సమకూర్చిన కిరాణా సరకులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, కాళ్లకూరి బుజ్జి, అప్పన వీరన్న తదితరులు పాల్గొన్నారు.